## క్లుప్తంగా

### బాల్యవివాహాలు నేరం

ఖానాపూర్: బాల్య వివాహాలు చేయడం చట్ట రీత్య నేరమని ఐసీడీఎస్ సీడీపీవో సరిత అన్నారు. మంగళవారం పట్టణంలోని అంబేద్కర్‌నగర్ అంగన్వాడీ కేంద్రంలో మిషన్ శక్తి టీం ఆధ్వర్యంలో బాల్య వివాహాల నివారణపై జరిగిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. సూపర్‌వైజర్లు నిర్మల, షెహనాజ్, శారద, మిషన్‌శక్తి కోఆర్డినేటర్ సవిత, జెండర్ స్పెషలిస్టులు జ్యోతి, మౌనిక తదితరులున్నారు.

### ఆర్థికసాయం

దిలావర్‌పూర్: మండలంలోని సాంగ్విలో తల్లిదండ్రులను కోల్పోయిన నిమ్మ అక్షయ, నిమ్మ అజయ్ అనే ఇద్దరు విద్యార్థులకు మంగళవారం అదే గ్రామంలోని ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు రూ.ఆరువేల ఆర్థికసాయం అందించారు. అక్షయ ఇటీవల కేజీబీవీలో పదోతరగతి పూర్తి చేయగా అజయ్ పక్క గ్రామమైన బన్సపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. వారికి అండగా ఉండేందుకే సాయం అందించామని హెచ్ఎం సుగుణ, ఉపాధ్యాయులు మురళీ మనోహర్‌రెడ్డి వెల్లడించారు.

### యూత్ ఆధ్వర్యంలో కమాన్ ఏర్పాటు

ముధోల్: మండలంలోని ముద్గల్ గ్రామ శివారులో రాంసెన్ యూత్ ఆధ్వర్యంలో మంగళవారం రూ.లక్షా యాభై వేలతో స్వాగతం పలికే కమాన్‌ను ఏర్పాటు చేశారు. యూత్ ఆధ్వర్యంలో గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలకు రూ.15వేలు, పేద కుటుంబాలకు రూ.20వేల ఆర్థికసాయం అందించినట్లు యూత్ సభ్యులు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే నారాయణ్‌రావుపాటిల్ హాజరై కమాన్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ నర్సాగౌడ్, బాసర జెడ్పీటీసీ రమేశ్, గ్రామస్తులు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

### మండల సర్వసభ్య సమావేశం వాయిదా


వాయిదా వేస్తున్నట్లు ప్రకటిస్తున్న ఎంపీడీవో

సోన్: మండలకేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సోన్ మండల సర్వసభ్య సమావేశం కోరం లేక వాయిదా వేసినట్లు ఎంపీడీవో సురేశ్ తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సభ్యులు గైర్హాజరు కావడంతో సమావేశం వాయిదా వేశామని.. మళ్లీ నిర్వహించే తేదీని త్వరలో ప్రకటిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీవో ఖలీల్ హైమద్, ఎంపీవో మంజులరెడ్డి, ఐకేపీ ఏపీఎం గంగామణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోతి, అధికారులు పాల్గొన్నారు.

### పాదపూజ

సోన్: మండల కేంద్రంలో అభ్యాస గురుకులంలో మంగళవారం విద్యార్థుల తల్లిదండ్రులకు పాదపూజ నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ పుల్లూరి రమేశ్ మాట్లాడుతూ జన్మనిచ్చిన తల్లిదండ్రులు భగవంతుని స్వరూపమని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులకు ప్రగతి పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ మమత, రజిత, ప్రభు, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

### ఆర్టీసీలో ప్రయాణం సురక్షితం

కుంటాల: గమ్యస్థానాలను సురక్షితంగా చేరుకునేందుకు ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించాలని టీఐ కేకే రెడ్డి కోరారు. మంగళవారం కుంటాల బస్టాండ్ ఆవరణలో రోడ్డు భద్రతపై ప్రయాణికులకు అవగాహన కల్పించారు.
గమ్యం యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. సేఫ్టీగార్డెన్ కుమార్, విలేజ్ బస్ ఆఫీసర్ జి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

### గ్రాడ్యుయేషన్ డే

లక్ష్మణచాంద: మండల కేంద్రంలోని ద్రోణ ఉన్నత పాఠశాలలో మంగళవారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు సర్టిఫికెట్లను ప్రధానోపాధ్యాయుడు గంగాధర్, కరస్పాండెంట్ సురేశ్‌రెడ్డి అందించారు. ఉపాధ్యాయుడు ముత్యం, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

### వసతులు కల్పించాలి

కుంటాల: పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్ తదితర మౌలిక వసతులు కల్పించాలని తహసీల్దార్ ఎజాజ్ అహ్మద్ ఖాన్ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. విద్యాసంవత్సరం చివరి రోజు కావడంతో మధ్యాహ్న భోజనం పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎంఈవో ముత్యం, ఆర్ఐ అడెల్లు, సగ్గం గంగాధర్, కార్యదర్శి రాజాబాపు ఉన్నారు.

### పనులు పకడ్బందీగా చేపట్టాలి

దస్తురాబాద్: అమ్మ ఆదర్శ పాఠశాల పథకం కింద ఎంపిక చేసిన పాఠశాలల్లో పనులు పకడ్బందీగా చేపట్టాలని ఎంపీడీవో రమేశ్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని భూత్కూర్ పంచాయతీలోని రాంపూర్, మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో చేపట్టే పనులను పరిశీలించారు. సెలవుల్లో పనులు పూర్తి చేయాలన్నారు. హెచ్ఎంలు, స్వయంసహాయక సంఘాల సభ్యులు ఉన్నారు.

# హనుమాన్ జయంతి


కుంటాలలో శోభాయాత్రలో పాల్గొన్న దీక్షాపరులు, మహిళలు


భైంసాటౌన్: రాంనగర్ ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు


భైంసా: అయోధ్యలో బాసరకు చెందిన స్వాములు


లక్ష్మణచాంద: తిర్పెల్లిలో పూజలు చేస్తున్న గ్రామస్తులు

జిల్లావ్యాప్తంగా మంగళవారం హనుమాన్ జయంతి ఘనంగా నిర్వహించారు. దీంతో హనుమాన్ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఈ సందర్భంగా అభిషేకాలు, హోమాలు తదితర పూజాది కార్యక్రమాలు, అన్నదానం చేశారు. ఖానాపూర్ ప్రసన్నాంజనేయ ఆలయంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్‌నాయక్, నాయకులు పూజలు చేశారు. కుభీర్‌లో హిందువాహిని ఆధ్వర్యంలో హనుమాన్ విగ్రహంతో శోభాయాత్ర నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని భాగ్యనగర్ హనుమాన్, రాధాకృష్ణ ఆలయాలు, బంగల్‌పేట్ దర్వాజా హనుమాన్ ఆలయం, ఆదర్శనగర్ వీరాంజనేయ హనుమాన్ ఆలయం, ప్రియదర్శినినగర్ అభయాంజనేయ హనుమాన్ ఆలయాల్లో డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు, మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్ పూజలు చేశారు. సోన్ మండలం కద్తాల్ హనుమాన్ ఆలయంలో అఖండ భజన కార్యక్రమం, శ్రీ వీరబ్రహేంద్ర స్వామి ఆలయంలో ఆశ్రమ వ్యవస్థాపకులు శ్రీరామానందస్వామి ఆధ్వర్యంలో శిష్యబృందం భజనలు ఆలపించారు. భైంసాలోని కమలాపూర్ గుట్ట సమీపంలోని దక్షిణముఖి హనుమాన్ ఆలయంలో ఎమ్మెల్యే రామారావుపటేల్, బీజేపీ నాయకులు పూజలు చేశారు. కుంటాలలో గురుస్వామి భుజంగం గణపతి ఆధ్వర్యంలో హనుమాన్ దీక్షాపరులు పొర్లుదండాలు చేసి హనుమాన్ చిత్రపటాన్ని ఊరేగింపుగా తీసుకెళ్లారు. బాసరకు చెందిన హనుమాన్ దీక్షాపరులు అయోధ్యలో బాలరాముడిని దర్శించుకున్నారు.
– సాక్షి నెట్‌వర్క్


లోకేశ్వరం : రాయపూర్‌కాండ్లీలో శోభాయాత్ర


సోన్: కద్తాల్‌లో అఖండ భజన కార్యక్రమం


నిర్మల్‌లోని భాగ్యనగర్ ఆలయం వద్ద అన్నదానంలో నేతలు


ముధోల్ : కొండగట్టుకు బయలుదేరుతున్న భక్తులు


కుభీర్‌లో హిందూవాహిని ఆధ్వర్యంలో నిర్వహించిన హనుమంతుడి శోభాయాత్రలో పాల్గొన్న జనం


మామడ మండలం పొన్కల్‌లో భక్తుల శోభాయాత్ర


నర్సాపూర్(జి)లో వీరహనుమాన్ మందిరం వద్ద..


ఖానాపూర్ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం వద్ద పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు



కడెం: కొండుకూర్ హనుమాన్ ఆలయం వద్ద పండ్లు పంపిణీ చేస్తున్న గంగాధర్

# ఈదురుగాలులు, వర్షంతో నష్టం

- కుభీర్‌లో నిలిచిన విద్యుత్ సరఫరా

కుభీర్: మండలంలో సోమవారం ఈదురుగాలులు, అకాలవర్షానికి పంటలు దెబ్బతినడంతోపాటు చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. విద్యుత్ తీగలు తెగిపోవడంతో కుభీర్, బెల్గాం తదితర గ్రామాలు రాత్రంతా కరెంట్ లేక అంధకారంలోనే ఉన్నాయి. దీంతో మంగళవారం ఉదయం నీటి కోసం చేతిపంపుల వద్ద బారుల తీరారు. కుభీర్‌లో బట్టిగల్లీ, బెల్గాం, దార్‌కుభీర్, గొడ్సర గ్రామాల్లో జనరేటర్ సాయంతో మోటార్లతో నీళ్లు తీసుకున్నారు. మరమ్మతుల అనంతరం మంగళవారం సాయంత్రం విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. కుభీర్‌లో ఆకం దశరథ్‌కు చెందిన నాలుగెకరాల్లో జొన్న పంట నేలకొరిగింది. పోలీస్‌స్టేషన్ వద్ద, గొడ్సరలో విద్యుత్ స్తంభాలు కిందపడటంతో సిబ్బంది మరమ్మతులు చేశారు.


గొడ్సరలో స్తంభాన్ని సరిచేస్తున్న సిబ్బంది


కుభీర్‌లో నేలవాలిన జొన్న పంట

లక్ష్మణచాంద: మండలంలో సోమవారం సాయంత్రం కురిసిన వర్షానికి వడ్యాల్, బాబాపూర్ గ్రామాల్లో పంటలు దెబ్బతిన్నాయి. పంట నేలకొరగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

# మోదీని విమర్శించే స్థాయి సీఎంకు లేదు

- ముధోల్ ఎమ్మెల్యే రామారావ్ పటేల్

భైంసాటౌన్: దేశంలో అవినీతిరహిత, స్వచ్ఛమైన పాలన అందిస్తున్న ప్రధాని మోదీని విమర్శించే స్థాయి సీఎం రేవంత్‌రెడ్డికి లేదని ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ఎస్ఎస్ కాటన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆదిలాబాద్‌లో జరిగిన కాంగ్రెస్ బహిరంగ సభలో ప్రధాని మోదీని ఉద్దేశించి సీఎం అవాకులు, చెవాకులు పేల్చారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికీ ఆరు గ్యారెంటీలను అమలు చేయడం లేదని విమర్శించారు. సమావేశంలో భైంసా ఏఎంసీ మాజీ చైర్మన్ రాజేశ్‌బాబు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవిపాండే, నారాయణ్‌రెడ్డి, నాయకులు జీవీ రమణారావు, పట్టణాధ్యక్షులు మల్లేశ్వర్, తాలోడ్ శ్రీనివాస్ తదితరులున్నారు.

**ఎన్నికల ప్రచారం..**


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామారావ్ పటేల్

బీజేపీ ప్రభుత్వంతోనే దేశం అభివృద్ధి సాధిస్తుందని ఎమ్మెల్యే పవార్ రామారావుపటేల్ అన్నారు. బీజేపీ మహాజన సంపర్క్ అభియాన్‌లో భాగంగా మంగళవారం పట్టణంలోని రాజీవ్‌నగర్‌లో బూత్ నంబర్-127లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీజేపీ అభ్యర్థి గోడం నగేశ్‌ను గెలిపించాలని కోరారు. కౌన్సిలర్ తోట విజయ్, మున్సిపల్ మాజీ చైర్మన్ గంగాధర్, సావ్లి రమేశ్, పట్టణ అధ్యక్షులు మల్లేశ్వర్, బాజీరావు, అనిల్ ఉన్నారు.

### పోషకుల సమావేశం

తానూరు: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మంగళవారం పోషకుల సమావేశం నిర్వహించారు. ఆరో తరగతి నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థుల హాజరుశాతం వివరాలను పోషకులకు వివరించారు. ఎల్వి జిల్లా పరిషత్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు నరేందర్ మాట్లాడారు. అనంతరం ప్రొగ్రెస్‌కార్డులు అందించారు. భూమన్నయాదవ్, మాధవ్‌రావ్, సుదర్శన్, సుజాతదేవి, గంగారాణి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

### ప్రోగ్రెస్‌కార్డులు అందజేత

సోన్: మండలంలోని వివిధ పాఠశాలల్లో మంగళవారం విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులు అందించారు. ఈసందర్భంగా న్యూవెల్మల్ బొప్పారం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోషకుల సమావేశంలో హెచ్ఎం నాలం విద్యాసాగర్ మాట్లాడారు. పాఠశాలలు తిరిగి జూన్ 12న ప్రారంభం అవుతాయని పేర్కొన్నారు. అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ గోదావరి, వీడీసీ కోశాధికారి కొండ రవి, పోషకులు తదితరులు ఉన్నారు.

ఖానాపూర్: మండలంలోని పాతఎల్లాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం ప్రోగ్రెస్ కార్డులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం మారుతిస్వామి, ఉపాధ్యాయులు కిషన్ పాల్గొన్నారు.

ముధోల్: మండలంలోని గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మంగళవారం విద్యార్థులకు ఉపాధ్యాయులు ఆన్‌లైన్ పాస్ ప్రోగ్రెస్ కార్డులను అందజేశారు. సెలవుల్లో పాటించాల్సిన జాగ్రత్తలను ఉపాధ్యాయులు వివరించారు.

# గుట్టుగా సామాజిక తనిఖీ ప్రజావేదిక

- మీడియాను అనుమతించని అధికారులు

సారంగాపూర్: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం డీఆర్‌డీవో విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఉపాధిహామీ పథకం 14వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక గుట్టుగా నిర్వహించారు. సమావేశం ప్రారంభంలో మీడియా ప్రతినిధులను లోనికి వెళ్లకుండా ఎంపీడీవో లక్ష్మీకాంతరావు అడ్డుకున్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున అనుమతి లేదని పేర్కొన్నారు. ఇదే విషయమై డీఆర్‌డీవోను వివరణ కోరగా.. అలాంటి ఉత్తర్వులు లేవని.. లోపలికి రావొచ్చని స్పష్టం చేశారు. దీంతో చివరికి రాత్రి 7:30 గంటలకు అధికారులు వివరాలు తెలిపారు. మొత్తం 32 గ్రామ పంచాయతీల్లో చేపట్టిన పనులకు సంబంధించిన వివరాలను ఏపీవో లక్ష్మారెడ్డి వెల్లడించారు. సామాజిక తనిఖీ బృందాలు గుర్తించిన అక్రమాలకు గాను పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్ల నుంచి రూ.8,183 రికవరీ చేయాలని, రూ.4వేలు పెనాల్టీగా వసూలు చేయాలని డీఆర్‌డీవో విజయలక్ష్మి ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవోలు సరోజ, లక్ష్మీకాంతరావు, హెచ్ఆర్ మేనేజర్ సుధాకర్, ఎస్ఆర్పీ సాయిలు తదితరులు పాల్గొన్నారు.


వివరాలు వెల్లడిస్తున్న బృందం సభ్యులు

### ప్రతిష్ఠాపన ఉత్సవాలు

ఖానాపూర్: మండలంలోని పాతఎల్లాపూర్ రేణుకా ఎల్లమ్మ విగ్రహ త్రయాహ్నిక స్థిర ప్రతిష్ఠాపన ఉత్సవాలు పాతఎల్లాపూర్, నడింపల్లె ఆలయ కమిటీల ఆధ్వర్యంలో కొనసాగుతున్నాయి. మంగళవారం పుణ్యాహవచనం, రుద్రహవనం, ధాన్యాధి వాసాంగ హోమాలు, కళాహోమాలు, ప్రతిష్ఠాంగ హోమాలు, ధాన్యఫలపుష్ప శయ్యాదివాస కార్యక్రమాలు నిర్వహించారు. పురోహితులు పిసుపాటి రేవంత్ శర్మ, సంతోష్‌శర్మ, గౌతమ్‌శర్మ, రాఘవేంద్రశర్మ, నరేంద్రశర్మ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.

### పోషకులకు బహుమతులు అందజేత

మామడ: సాధారణంగా పాఠశాలకు క్రమం తప్పకుండా హాజరయ్యే విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఉపాధ్యాయులు బహుమతులు ఇస్తుంటారు. కానీ మండలంలోని పొన్కల్ జెడ్పీ పాఠశాలలో జరిగే పోషకుల సమావేశానికి విద్యార్థుల తల్లిదండ్రులెవరూ రావడం లేదు. దీంతో ప్రధానోపాధ్యాయుడు మైన అరవింద్‌కుమార్ సమావేశాలకు పోషకుల హాజరు శాతం పెంచాలనే ఉద్దేశంతో హాజరయ్యే వారందరికీ ప్రోత్సాహక బహుమతులు అందిస్తున్నారు. మంగళవారం రూ.6వేల విలువైన వాటర్ బాటిళ్లను పోషకులకు.. విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులు అందించారు.


బహుమతి అందిస్తున్న హెచ్ఎం అరవింద్‌కుమార్

# కాంగ్రెస్ పాలనతోనే అభివృద్ధి

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

ఖానాపూర్: కాంగ్రెస్ పాలనతోనే దేశంలో అభివృద్ధి సాధ్యం అవుతుందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. మంగళవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో పలువురు బీఆర్ఎస్, బీజేపీ, దళిత సంఘాల నాయకులు, ముదిరాజ్ సంఘ సభ్యులు ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. బీఆర్ఎస్ ఖానాపూర్ మండల మాజీ అధ్యక్షుడు బక్కశెట్టి కిశోర్, ఖానాపూర్ మాజీ సర్పంచ్ బక్కశెట్టి లక్ష్మణ్, మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు దాసరి రాజన్న, నేత శ్యామ్, మల్లేశ్‌గౌడ్, శంకర్‌గౌడ్, సత్యం, రాజేశ్వర్, శ్రీనివాస్, రాములు, గంగాధర్, నాగరాజు, కీర్తి రవీందర్ పార్టీలో చేరారు. అంతకుముందు గోసంపల్లెలో జరిగిన కార్యక్రమంలో సత్తనపల్లి పీఏసీఎస్ చైర్మన్ అమంద శ్రీనివాస్, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి తూము చరణ్, తుదిగేని రాజలింగు, లవంగాల శివ, అమంద మహేశ్, సైకిలాట్, కుమార్, మోతె రాజలింగు, కిరణ్, రమేశ్‌కు ఎమ్మెల్యే కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు దయానంద్, పట్టణాధ్యక్షుడు రమేశ్, సంతోష్, షబ్బీర్‌పాషా ఉన్నారు.


ఎమ్మెల్యే సమక్షంలో పార్టీలో చేరుతున్న నేతలు

**అంబలి కేంద్రం ప్రారంభం**

కడెం: మండలంలోని నచ్చన్‌ఎల్లాపూర్ బస్టాప్ వద్ద, మాజీ సర్పంచ్ బొడ్డు గంగన్న ఏర్పాటు చేసిన అంబలి కేంద్రాన్ని మంగళవారం ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ప్రారంభించారు. ఇందులో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మల్లేశ్, గంగన్న, భూషణ్, శ్రీనివాస్, మహేందర్, వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

# ‘ఐసీడీఎస్‌లో అక్రమాలపై విచారణ చేయాలి’

ఖానాపూర్: ఖానాపూర్ ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయ పరిధిలో జరిగే అక్రమాలపై విచారణ చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం నూతన్‌కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలో విలేకరులతో మాట్లాడారు. సీడీపీవో.. కేంద్రాల్లో ఉన్న అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల వద్ద కమీషన్లు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. కేంద్రాల్లో ప్లెక్సీలు, ఇతర సామగ్రి కొనుగోలు పేరిట వసూలు చేస్తున్న వాటిపై విచారణ చేయాలని కోరారు. ప్రాజెక్టు పరిధిలో జరుగుతున్న అక్రమాలను సీపీఎం పార్టీ, ప్రజా సంఘాల నుంచి తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. బాలికల సంరక్షణ పథకంలోనూ వసూళ్లకు పాల్పడుతున్నారని విమర్శించారు. గతంలో మామడ మండలంలోనూ వసూళ్లు వెలుగులోకి వచ్చాయన్నారు. ఉన్నతాధికారులు విచారణ చేసి చర్యలు తీసుకోకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు డాకూరి తిరుపతి, సీపీఎం మండల కార్యదర్శి నాగెల్లి నర్సయ్య, సంచుల నారాయణ, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి తొడసం శంభు ఉన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

### దుప్పి దాడిలో ఒకరికి గాయాలు

ఖానాపూర్: వ్యవసాయ పనుల నిమిత్తం చేనులోకి వెళ్లిన ఓ వ్యక్తిపై దుప్పి దాడి చేసిన ఘటన ఖానాపూర్ మండలంలోని సేవానాయక్‌తండాలో మంగళవారం చోటు చేసుకుంది. రోజు మాదిరి గ్రామానికి చెందిన బిలావత్ రాములు తన చేనులో పనులు చేస్తున్నాడు. గ్రామశివారులోని మందోట వద్ద కుంటలో నీరు తాగేందుకు వచ్చిన దుప్పిని, కొన్ని కుక్కలు వెంబడించాయి. పరుగెడుతున్న దుప్పికి రాములు ఎదురుకావడంతో అతనిపై దాడి చేసింది. దీంతో వెంటనే బాధితుడిని ఖానాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం నిర్మల్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు.